క్లుప్తంగా

పోషకాహారాన్ని పిల్లలకు అందించాలి

చల్లపల్లి: పిల్లలకు పోషకాహారాన్ని అందించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని సర్పంచ్ వల్లూరు ఉమ అన్నారు. మండల పరిధిలోని వక్కలగడ్డ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన సుపోషిత్ భారత్–సక్త్ భారత్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లల్ని రోజూ అంగన్‌వాడీకి పంపేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అలానే బాలింతలు, గర్భిణులు బలమైన ఆహారం తీసుకున్నప్పుడే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఆమె వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విశ్రాంతమ్మ, మహిళా సంరక్షణ కార్యదర్శి వేమూరి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు దుర్గారాణి, నిర్మల, లక్ష్మి, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్లతో సీనియర్లు స్నేహంగా మెలగాలి



బంటుమిల్లి: కాలేజీలో కొత్తగా ప్రథమ సంవత్సరం డీగ్రీ తరగతుల్లో ప్రవేశాలు పొందిన జూనియర్ విద్యార్థులతో సీనియర్లు స్నేహంగా ఉండి వారిలో భయం పోగొట్టి చదువు పట్ల శ్రద్ధ వహించే విధంగా కృషి చేయాలని ప్రిన్స్‌పాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో సోమవారం విద్యార్థులకు స్టూడెంట్స్ ఇండక్షన్ ప్రోగ్రాం(ఎస్‌ఐపీ) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జూనియర్ విద్యార్థులు సీనియర్లతో మంచిగా కలిసిమెలసి ఉండి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అందుకున్నప్పుడు తల్లిదండ్రులకు, విద్యాబోధన చేసిన అధ్యాపకులకు, ఆయా గ్రామాలకు మంచి పేరు వస్తుందన్నారు.

సేకరించిన దుస్తులు నిరుపేదలకు పంపిణీ



చల్లపల్లి: ఇతరులు వినియోగించుకునేందుకు అనువుగా ఉన్న దుస్తులను సేకరించి నిరుపేదలకు చేరవేసే ప్రక్రియలో భాగంగా స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో వాసవీ హెల్పింగ్ హ్యాండ్స్ అనే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వస్త్రాలు ఇవ్వదలచిన దాతలు వాటిని తమకు అందజేస్తే అవసరమైన వారికి అందజేస్తామని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ చేయూతనిచ్చి భాగస్వాములు కావాలని క్లబ్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అమరవాణి, గోళ్ల వెంకటరత్నం, సభ్యులు గోళ్ల ద్రోణ పూర్ణచంద్రరావు, విజయ్ కృష్ణదీపిక తదితరులు పాల్గొన్నారు.

పంటకు ఈ క్రాప్ నమోదు చేయించాలి



మోపిదేవి: రైతులు తాము పండించిన పంటకు ఈ క్రాప్ చేయించుకోవాలని మండలంలోని రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నెలాఖరుకు గడువు విధించిందని.. రైతులు సుమారు 36 శాతం ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని.. ఇందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో సభ్యులు కోరారు.

దాడికి పాల్పడిన ఇద్దరు అరెస్ట్



మోపిదేవి: మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామానికి చెందిన యలమంచి సురేష్‌పై దాడికి పాల్పడిన మైలా శివకుమార్, పీతా నవీన్ కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ తెలిపారు. మోపిదేవి పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. సురేష్ తమ ఇంటికి ఈనెల 20వ తేదీ శనివారం తెల్లవారుజామున సుమారు 3.45 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి చంపుతామని బెదిరించి బంగారం, రూ.50 వేల నగదు అపహరించారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా నిందితులు బండికోళ్లంక కృష్ణాకరకట్ట రోడ్డు మీద సోమవారం ఉదయం పట్టుబడినట్లు వివరించారు. నిందితులను జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్, మొవ్వ వారి ఎదుట రిమాండ్ నిమిత్తం సోమవారం హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా జగన్మాత

దసరా శరన్నవరాత్రులు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో కొలువైన లోకనాయకి భక్తులకు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మను చూడటానికి భక్తులు ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కట్టెపొంగలిని తల్లికి నైవేద్యంగా సమర్పించి జగన్మాత ముందు ప్రణవిల్లారు.

- అట్టహాసంగా ప్రారంభమైన శరన్నవరాత్రులు
- ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లు
- జగన్మాత నామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణాలు



కోడూరులోని కనకదుర్గమ్మ



బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో..



బాల త్రిపుర సుందరీ దేవీగా అమ్మవారు



గూడూరులో శ్రీ వనబాలా దేవిగా..



విశేష అలంకరణలో అమ్మవారు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కోడూరు: తొలిరోజైన సోమవారం కోడూరులోని గంగాభవానీ అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అర్చకులు కోమ్మూరి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ, సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. స్థానిక అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీ కన్యకాంబ అలయంలో..

నాగాయలంక: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలోని స్థానిక శ్రీ పార్వతీ సమేత, కన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీ నగరేశ్వర స్వామివారి దేవస్థానంలో దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ, గురుదేవులు కె.భానుప్రసాద్ దివ్యా మంగళాశీస్సులతో సోమవారం ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. ఉత్సవాలకు ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ కొల్లిపర సుబ్బారావు శ్రీకారం చుట్టారు. తాడికొండ సత్యనారాయణ–జయలక్ష్మీ దంపతులు పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణానది తీరంలోని శ్రీరామపాద క్షేత్రం దేవాలయాల సముదాయంలో శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరం శ్రీదుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాల్లో శరన్నవరాత్రులు ప్రారంభం సందర్భంగా దుర్గమ్మను సోమవారం శ్రీరజితకృత శ్రీ విజయ దుర్గాదేవిగా అలంకరించారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ ఈవో సీహెచ్ సుధాకరరావు పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ అర్చకత్వంలో ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు)–అరుణ దంపతులు విశేష పూజలు జరిపారు. భావదేవరపల్లిలోని శ్రీ అన్నపూర్ణదేవి సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోను దసరా పూజలు ఘనంగా నిర్వహించారు.

వైభవంగా దేవీ నవరాత్రులు..

బంటుమిల్లి: మండల పరిధిలో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమైనాయి. స్థానిక కనక దుర్గ నగర్‌లో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గ ఆలయం, పాశ్చాపురం శ్రీ సువర్చలాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరీ దేవీగా.. పెదతుమ్మిడి శివాలయంలో అమ్మవారు రజిత కవచాలాంకృత పార్వతీ దేవీగా దర్శనమిచ్చారు. స్థానిక ఆలయాల్లోనూ దేవీ పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గూడూరు: మండల పరిధిలోని అమ్మవారి ఆలయాల్లో శ్రీ దేవీ శరన్నరాత్రి ఉత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామివారి దేవస్థానంలో ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శరన్నవరాత్రి మహోత్సవాలను వేద పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. మోపిదేవి శ్రీ సకలేశ్వర స్వామివారి ఆలయంలో ఈవో జోగి ప్రవీణ ఆధ్వర్యంలో, కొక్కిలిగడ్డ గ్రామంలో కొలువైన శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో గుండెపూడి నాగరాజశేఖర్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీ పార్వతీ అమ్మవారికి త్రికాలర్చనలు, శ్రీ చక్రార్చనలు, మహిళలతో సామూహిక కుంకుమార్చనలు జరిపించారు.

పెడన: దసరా మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గ్రామ దేవత శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. ఉభయదాతలు బూసం గిరిధర్, కాశీఅన్నపూర్ణాదేవి దంపతులతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆసాది తోట వెంకట రామారావు, ఈవో గోవాడ వెంకట కృష్ణారావుతో పాటు ఆలయ భక్త బృందం కార్యక్రమాలను పర్యవేక్షించారు. ముత్యాలమ్మ ఘటం దేవస్థానంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు.

చల్లపల్లి: మండల పరిధిలోని నడకుదురులో కొలువైన శ్రీ బాలా త్రిపురసుందరీ సమేత శ్రీ పృథ్వీశ్వరస్వామివారి ఆలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని సోమవారం బాలా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. స్థానిక ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవీ భక్త బృందం వారు గీతాపారాయణం, లలిత, విష్ణు సహస్రనామాలు జపిస్తూ అమ్మవారి పల్లకీ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

కృత్తివెన్ను: మండల పరిధిలోని కృత్తివెన్ను శివాలయం, అడ్డపర్ర, నీలిపూడి, గరిశపూడి అమ్మవారి ఆలయాల్లో శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కృత్తివెన్ను శివాలయంలో దంపతులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

మచిలీపట్నం టౌన్: మచిలీపట్నంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవ, విశిష్ట సహస్రనామ కుంకుమార్చన, మంత్ర పుష్పము, జపములు, ఆశీర్వచనము వంటి పూజలు, శ్రీ లలితా సహస్రనామ పారాయణం కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పర్వత వర్ధిని రాజరాజేశ్వరి అమ్మవారికి చలమలశెట్టి లక్ష్మీకృష్ణ దంపతులు పూజలు నిర్వహించారు. ఆజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలోని అమ్మవార్లు శ్రీ కన్యకా పరమేశ్వరీదేవి, శ్రీ పార్వతీదేవి, శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారాలలో దర్శనమిచ్చారు. స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో రాత్రి చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గుడివాడకు చెందిన పాదర్తి సిస్టర్స్ శిష్య బృందం పలు భక్తి, జానపద గీతాలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘంటసాలలో ఘనంగా దసరా ఉత్సవాలు..



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఘంటసాల: ఘంటసాల సత్రవు సెంటర్లోని రామాలయంలో దసరా ఉత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాకు చెందిన ఆదిరాల సుమన్–చైతన్య దంపతులు అమ్మవారి విగ్రహం అందించగా అర్చకులు ఆర్‌వీఎస్ సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, కలశ పూజ, సహస్ర నామ పూజలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షురాలు ఆదిరాల దుర్గా భవాని, పోతార్లంక శ్రీనివాసరావు, పోతార్లంక వెంకటేశ్వరరావు, ఆదిరాల రాముడు, సత్యనారాయణ, ప్రసాద్, భవాని, భక్తులు పాల్గొన్నారు. ఘంటసాల గ్రామంలోని శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి దేవస్థానంలో అమ్మవారు సర్వాంకృత రజిత కవచ సహిత బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమం కార్యక్రమం



విజయ దుర్గదేవిగా శ్రీదుర్గమ్మ



పల్లకీ సేవలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు

లక్ష గాజులతో రాజరాజేశ్వరికి అలంకరణ



నగరంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఆలయంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారిని లక్ష గాజులతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను అర్చకులు ఘంటసాల భాస్కర్ శర్మ నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి సమ్మెట ఆంజనేయ స్వామి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

– మచిలీపట్నం టౌన్

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

గూడూరు: మండల పరిధిలోని పలు సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.వి.రామకృష్ణ తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో మల్లవోలు–1, కంకటావ, గూడూరు–2 గ్రామ సచివాలయాల్లో.. 25, 26 తేదీల్లో రాయవరం, కప్పలదొడ్డి, తరకటూరు సచివాలయాల్లో శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



కోడూరు: మండలంలోని హంసలదీవి గ్రామానికి చెందిన శేరు శ్రీనివాసరావు ప్రమాదవశాత్తు ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సోమవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పరశె మాధవరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, మత్స్యకార నేతలు చిలకలపూడి ధర్మయ్య, విశ్వనాధపల్లి వెంకటేశ్వరరావు, లంకే నాగమల్లేశ్వరరావు, బోయిన గోవిందు, మేడా నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

పెడన: మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. పెడన అధ్యక్షుడు కె.జ్ఞానప్రసాద్ మాట్లాడుతూ.. పట్టణంలో రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిలో సుమారు 100 మంది కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు పెంచాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ నాయకులు పంచల నరసింహారావు, పెడన సంఘ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, ఏలేటి ఏసు, ఎస్.వెంకటేశ్వరరావు, బి.రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవ కమిటీ సభ్యుడిగా బాలాజీ

మచిలీపట్నం టౌన్: విజయవాడ ఇంద్రకీలాద్రిలో జరుగుతున్న దసరా ఉత్సవాలకు ఉత్సవ కమిటీ సభ్యుడిగా మచిలీపట్నంకు చెందిన వాడపల్లి బాలాజీ సువర్ణ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా బాలాజీను పలువురు అభినందించారు.

ఉచిత ఆరోగ్య పరీక్షలు

గూడూరు: స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కప్పలదొడ్డి, మల్లవోలు గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. కప్పలదొడ్డిలో మల్లవోలు పీహెచ్‌సీ వైద్యాధికారిణి మహిత ఆధ్వర్యంలో వైద్య బృందం స్థానికులకు పలు పరీక్షలు నిర్వహించారు. అనంతరం క్యాన్సర్ మహమ్మారిపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి యక్కల మాధవి పాల్గొన్నారు. మల్లవోలు శివారు కుమ్మరిపాలెంలో డాక్టర్ తరుణ్ శంకర్ బృందం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

వేధింపులు తాళలేక ఎఫ్ఎన్‌వో ఆత్మహత్యాయత్నం



మహిళను పరామర్శిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నం అర్బన్: మచిలీపట్నంలోని సర్వజన ప్రభుత్వాస్పత్రిలో ఎఫ్ఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్న పీత దుర్గా సోమవారం ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగుల తీవ్రమైన వేధింపులను తట్టుకోలేక విధుల్లో ఉండగానే ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. చికిత్స పొందుతున్న బాధితురాలిని ఆసుపత్రిలో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) పరామర్శించారు. బాధితురాలికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆసుపత్రిలోని ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు విజయ్, రాహుల్ తరచూ వేధింపులకు గురి చేస్తున్నారని.. సాధిక్ అనే వ్యక్తి దాడి చేసేందుకు కూడా ప్రయత్నించాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నిరవధికంగా 15 గంటల పాటు నిరంతర డ్యూటీ చేయాలని ఒత్తిడి చేయడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు బాధితురాలు వెల్లడించారు.

ప్రారంభమైన తాళం భజన, మురళీ కోలాటం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

చిట్టూర్పు(ఘంటసాల): ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో కృష్ణా, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీలను ప్రజా ప్రతినిధులు, నాయకులు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా యువనేత మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కె.శ్రీనివాసరావులు మాట్లాడుతూ.. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు చాటి చెప్పే విధంగా పోటీలు నిర్వహిస్తున్న గుత్తికొండ ప్రసాద్‌ను అభినందించారు. కొడాలి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ గుత్తికొండ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాళం భజన, మురళీ కోలాటం పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొబ్బా గోవర్ధన్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ తుమ్మల చౌదరి బాబు, ఘంటసాల ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణ కుమారి, మాజీ వైస్ ఎంపీపీ బి.నాగమణి, నీటి సంఘం అధ్యక్షులు పరిశే చలపతి, సతీష్, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, తదితరులు పాల్గొన్నారు. దేవాలయంలోని అమ్మవారిని నాయకులు ప్రజా ప్రతినిధులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తాళం భజన పోటీలు నిర్వహించారు.

డ్రైవర్లు, క్లీనర్లను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, క్లీనర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలోని ఆయా వాహనాల్లో డ్రైవర్లు, క్లీనర్లుగా పనిచేస్తున్న తమకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఓ.లక్ష్మణరావు కోరారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఆటో, క్యాబ్ ఓనర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలో సొంత వాహనం తీసుకునే ఆర్థిక స్తోమత లేక కేవలం లైసెన్సు ఆధారంగా ప్రైవేటు డ్రైవర్లు, క్లీనర్లుగా పనిచేస్తున్న తమకు కూడా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. డ్రైవర్స్ సాధికారిత సంస్థ ఏర్పాటు చేసి ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్, విద్యారుణం వంటివి అందజేయాలన్నారు. బ్యాడ్జ్ కలిగిన ప్రతి ప్రైవేటు డ్రైవర్‌కు, ప్రతి హెవీ లైసెన్సు డ్రైవర్‌కు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించాలన్నారు. అసంఘటిత కార్మికులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.ఏడుకొండలు, పి.శ్రీనివాసరావు, టి.వీరబాబు, బి.వీరభద్రరావు పాల్గొన్నారు.

ముందుకు కదలని మురుగు

మోపిదేవి: మోపిదేవిలోని ప్రధాన రహదారులన్నీ మురుగు కాలువల వల్ల దుర్వాసన వస్తున్నాయని కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్ కోసూరు రామాంజనేయులు సోమవారం మీకోసంలో తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి మోపిదేవికి వచ్చే భక్తులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని రామాంజనేయులు ఆరోపించారు. మురుగు కాలువ పక్కనే కుళాయి నీరు పట్టుకోవాల్సి వస్తోందని ఆయన తెలిపారు.

ఉచిత కంటి పొర శస్త్ర చికిత్సలు

తాడేపల్లి(ఘంటసాల): తాడేపల్లి ఆశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. మలయాళ స్వామి పెద్దాశ్రమంలో కృష్ణాజిల్లా బైలండ్‌నెస్ కంట్రోల్ సొసైటీ, చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల, కీ.శే. సూరపనేని రామలింగయ్య–వెంకటరావమ్మల జ్ఞాపకార్థం వారి మనుమడు ఎన్నారై సూరపనేని శ్రీనివాస్–నాగప్రియ దంపతుల ఆర్థిక సహకారంతో కుటుంబ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి పొర చికిత్స శిబిరంలో సోమవారం వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలలిపారు. ఈ వైద్య శిబిరంలో చెన్నై శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వారి మొబైల్ ఆపరేషన్ వాహనాల్లో డాక్టర్ ఎలెక్స్, డాక్టర్ ఓవియో 27 మందికి ప్రత్యేక వైద్యులు కంటి పొర శస్త్ర చికిత్సలు చేశారు. డాక్టర్ ఓవియో ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్స్ జి.రంజిత్ కుమార్, డి.మెజెస్, ఆల్బర్ట్, జగన్, ఆప్తమ్స్ అశ్విన్, కిషోర్ కుమార్, టోని 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆశ్రమ ప్రతినిధులు కావూరి కోదండ రామయ్య, గొర్రెపాటి సురేష్, నిర్వాహకులు సూరపనేని వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కలెక్టర్ దంపతులు



మచిలీపట్నం టౌన్: స్థానిక అజాద్ రోడ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అట్టహాసంగా ప్రారంభించారు. దీనిలో భాగంగా శ్రీ పార్వతీ అమ్మవారి వద్ద జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ–పద్మ్వీ కళ్యాణి దంపతులు, ఆలయ ఛైర్మన్ మామిడి మురళీకృష్ణ–జయశ్రీ దంపతులు శాస్త్రోక్తంగా కలశ స్థాపన చేశారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వద్ద తాడేపల్లి మెహర్ బాబా–శ్యామల దంపతులు, గుడివాడ మెహర్ ప్రసాద్–సుజాత దంపతులు కలశ స్థాపన చేశారు. తెల్లవారుజామున అమ్మవార్లకు సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చన, నగరేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ కార్యదర్శి మోటమర్రి వెంకట బాబా ప్రసాద్, ఉపాధ్యక్షుడు సామా వెంకట లక్ష్మి కాంతారావు, సహాయ కార్యదర్శి బైసాని హయగ్రీవ రావు, కోశాధికారి ఉడత్తు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.